నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని కొంపల్లి ఏఈ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఐడియా వన్ ఫీడర్ నుంచి 11కేవీ స్టీల్ సిటీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు దూలపల్లి ఐడియా భారత్ పెట్రోల్ బంక్ లేన్, డెక్కన్ కాంటా వెనుక గల్లీ, కొంపల్లి స్టీల్ సిటీ, అయ్యప్ప ఆలయం ఎదురు గల్లీ, వెస్ట్రో సోవెన్షన్, అశోక ఏలా మైసన్ ఫేజ్ 2, ముఖేష్ సాయి దాబా లేన్, చైనా టౌన్ లేన్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నేడు నందక సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం

కుత్బుల్లాపూర్ : కొంపల్లి మున్సిపల్ పరిధి జయభేరి పార్క్ సమీపంలోని నందక ఐవీఎఫ్ సెంటర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ దీప రేఖ కోడూరు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతి ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. అనారోగ్యంగా ఉన్నవారు నేరుగా వచ్చి తమకు సంబంధించిన పరీక్షలు చేసుకోవచ్చన్నారు. 9000835000, 9000861000 నంబర్లకు ఫోన్ చేసి ముందుగా నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు.

జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు జరుగనున్నాయి. శనివారం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసి జాతరకు ఆహ్వానించారు. అదేవిధంగా జాతర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఠాకూర్ రాజేందర్ సింగ్, లక్ష్మణ్, బలరాం, మురళీగౌడ్, లింగంగౌడ్, శ్రీరాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దు



సూచనలు ఇస్తున్న అధికారులు

కుత్బుల్లాపూర్: చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా స్వచ్ఛ ఆటోలోనే వేయాలని పట్టణ ప్రత్యేకాధికారి చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ క్రిష్టారెడ్డి అన్నారు. శనివారం కొంపల్లిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. 3, 6వ వార్డుల్లో సిబ్బందికి పలు సూచనలు చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



స్టేషన్ ఆవరణలో ఒకే టీషర్టు ధరించిన పోలీసులు

జీడిమెట్ల: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ అన్నారు. శనివారం ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు ఒకే రకమైన టీ షర్టులు ధరించి నేరాల నియంత్రణకు అందరూ కృషి చేస్తామన్నారు. ఇప్పటికే పీఎస్ పరిధిలో ఉన్న కేసులన్నింటిలో కలిసికట్టుగా పనిచేసి నేరాల నియంత్రణలో ముందున్నామని తెలిపారు.

దళితుల అభ్యున్నతికి సహకరించాలి

జీడిమెట్ల: దళితుల అభ్యున్నతికి సహకరించాలని సహకరించాలని దళిత జన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జ రమేష్ కోరారు. శనివారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసి దళితుల సంక్షేమం గురించి మాట్లాడారు. అనంతరం వివిధ సమస్యలపై చర్చించారు.

ఆలయంలో అన్నదానం

జగద్గిరిగుట్ట: చింతల్, శ్రీసాయి కాలనీలోని అభయ ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నేకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కల్యాణ్ రావు పాటిల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి సహకరించాలి

ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న బాల్‌రెడ్డినగర్ నూతన కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ బాల్‌రెడ్డినగర్ నూతన వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం పేట్‌బషీరాబాద్ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. కాలనీ సమస్యలు వివరించిన అనంతరం నూతన కమిటీని ఎమ్మెల్యే అభినందించి మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో బాల్‌రెడ్డినగర్‌లో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేశామని, భవిష్యత్‌లో సైతం తనవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గారెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సలహాదారులు సుధాకర్ రెడ్డి, లక్ష్మయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

◆ బాపూనగర్‌కు చెందిన శుభానంద దేవి ముక్తేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఆలయ పనుల పురోగతిని వివరించారు. దీనిపై స్పందించిన ఆయన ఆలయాభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి దయానంద్, సలహాదారులు ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు శ్రీనివాస్, దుర్గాప్రసాద్, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా సభ్యులకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన



కార్యక్రమానికి హాజరైన మెప్మా, మహిళా గ్రూపు సభ్యులు

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ అధ్యక్షతన మెప్మా సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌జీవో యుగాంతర్ ఆధ్వర్యంలో డిజిటల్ ట్రాన్సాక్షన్‌పై అవగాహన కల్పించారు. చిన్న చిన్న కీప్యాడ్ ఫోన్ వాడే వాళ్లు కూడా డిజిటల్ ట్రాన్సాక్షన్ ఏ విధంగా చేయాలో వివరించారు. అదే విధంగా ఇందిరా మహిళా శక్తి పైన రివ్యూ మీటింగ్ నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌జీవో ప్రతినిధి తేజస్విని, సీవో మంజుల, మహిళా రిసోర్స్ పర్సన్‌లు, మహిళా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

మూడు రోజుల పాటు వేడుకలు



దుకాణాలతో ఆలయ ప్రాంగణం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న లక్ష్మీవేంకటేశ్వర స్వామి 54వ బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సిద్ధం చేసింది. 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆదివారం పుణ్యాహవాచనం, రక్షాబంధనం, వేదాపారాయణం, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినియోగం, సోమవారం అభిషేకం, తిరుకల్యాణ మహోత్సవం, మంగళవారం స్వామివారి పల్లకి సేవ, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రతీ సంవత్సరం కల్యాణానికి పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తున్న స్వామి వారి పట్టు వస్త్రాలు సమర్పించే కార్యక్రమం శనివారం నిర్వహించారు. జగద్గిరిగుట్ట సంజయపురి కాలనీ, మార్కండేయ స్వామి ఆలయం నుంచి పద్మశాలీ సంఘం వారు పెద్ద ఎత్తున పాదయాత్రగా వచ్చి లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించారు.



పట్టు వస్త్రాలతో పద్మశాలీ సంఘం సభ్యులు

బాకీ డబ్బులు ఇవ్వాలంటూ దూషిస్తున్నాడని హత్య

కేసును ఛేదించిన బాలానగర్ పోలీసులు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కె.సురేష్‌కుమార్

జీడిమెట్ల: బాలానగర్ పీఎస్ పరిధిలో డిసెంబర్ 30న జరిగిన హత్య కేసులో పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. శనివారం బాలానగర్ డీసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో డీసీపీ కె.సురేష్‌కుమార్ ఏసీపీ హన్మంతరావు, ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. జగద్గిరిగుట్ట అంబేడ్కర్ నగర్‌కు చెందిన కృష్ణగౌడ్(39), గాజులరామారానికి చెందిన ఆకుల కృష్ణ(42), సనత్‌నగర్‌కు చెందిన మాదర బోయిన రవి(39), గుర్రం నరేష్(39), గంబు శంకర్‌గౌడ్(44)లు స్నేహితులు. వీరంతా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటారు. కృష్ణగౌడ్‌కు కృష్ణముదిరాజ్ కొంత డబ్బు ఇవ్వాల్సి ఉంది. ఈ విషయంలో కృష్ణముదిరాజ్ ఎక్కడ కలిసిన కృష్ణగౌడ్ బూతులు తిట్టేవాడు. కృష్ణ ముదిరాజ్‌తో పాటు ప్రతిరోజు కృష్ణగౌడ్ అందరు స్నేహితులను నోటికి వచ్చిన పదజాలంతో తాగి తిడుతుంటాడు. కృష్ణగౌడ్ బాధ భరించలేక మిగతా నలుగురు అతడిని హతమార్చాలనుకున్నారు.

ప్లాన్ చేసి హతమార్చారు..

జనవరి 29వ తేదీన కృష్ణగౌడ్‌తో పాటు మిగతా నలుగురు మొత్తం ఐదుగురు కలిసి ఆటోలో మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గమ్మ గుడికి వెళ్లారు. అక్కడ ఐదుగురు కలిసి మద్యం తాగారు. అదేరోజు రాత్రి తిరిగి వస్తూ వారు వేసుకున్న ప్లాన్ ప్రకారం నలుగురు కలిసి కృష్ణగౌడ్‌ను ఆటోలోనే తీవ్రంగా కొట్టారు. దెబ్బలు తాళలేక పడిపోవడంతో బాలానగర్‌లోని కైటాన్ పరిశ్రమ ప్రాంతంలోని చెత్తకుప్పలో పడేశారు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి కైటాన్ పరిశ్రమ ప్రాంతంలో మృతిచెంది ఉన్నాడని బాలానగర్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతుడు ఆటోడ్రైవర్ కృష్ణగౌడ్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా సీసీ ఫుటేజీలను పరిశీలించారు. హత్యకు పాల్పడింది కృష్ణముదిరాజ్, రవి, నరేష్, శంకర్‌గౌడ్‌లుగా గుర్తించారు. నలుగురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. చేసిన నేరాన్ని అంగీకరించారు. నలుగురిపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు.

ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

సుభాష్‌నగర్ : ఆర్థిక ఇబ్బందులతో ఓ యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చిత్తూరు జిల్లాకు చెందిన తేజ్ స్వరూప్‌రెడ్డి (36) తన భార్య దుర్గాలక్ష్మి, ఇద్దరు పిల్లలు అశ్విని, దేవా అశ్వినితో కలిసి సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో కృష్ణమాలక్ష్మి నగర్ లో అద్దెకు ఉంటున్నాడు. గతంలో ఇతను చేస్తున్న ఉద్యోగం పోగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఇటీవల మరోచోట ఉద్యోగం రాగ.. గతంలో చేసిన అప్పులు పెరగడంతో వాటిని తీర్చే మార్గం లేక అతని భార్య పుట్టింటికి వెళ్లడంతో శనివారం సాయంత్రం ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. రోజు మాదిరిగానే పనిమనిషి సాయంత్రం వచ్చి తలుపులు తట్టగా తీయకపోవడంతో అనుమానం వచ్చి ఇంటి యజమానితో చెప్పింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా.. స్వరూప్ రెడ్డి ఫ్యానుకు ఉరేసుకుని అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మెగా జాబ్ మేళా

చింతల్: ఆదిత్య అండ్ మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ కోడి ఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీలలో ఉత్తీర్ణత సాధించిన యువత కోసం సుమారు 15 పైగా కంపెనీల ద్వారా సుమారు 2000 పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విప్రో, ఇన్ఫోసిస్, గూగుల్, జెన్‌ప్యాక్ తదితర బహుళ కార్పొరేట్ సంస్థల ద్వారా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఈ మెగా జాబ్ మేళా చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని మోడ్రన్ కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల యువత 8309447458, 9652098401 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 1675 గ్రాముల డ్రై గంజాయిని కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. ఒడిస్సాకు చెందిన బిజయ్‌కుమార్ గోండ్(27) కండ్లకోయలోని బిగ్‌బాస్కెట్ వేర్‌హౌస్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతను కొంతకాలంగా ఒడిస్సా నుంచి గంజాయిని నగరానికి తీసుకువచ్చి విక్రయాలు చేపడుతున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు శనివారం ఎస్ఐ ధర్మేష్ నేతృత్వంలో బిజయ్‌కుమార్ నివాసముంటున్న గదిపై దాడులు నిర్వహించి 1675 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నియోజకవర్గ ముదిరాజ్ సంఘం సమావేశం

చింతల్ : నియోజకవర్గ ముదిరాజ్ సంఘం సమావేశం ఆదివారం చింతల్ పరిధి హెచ్ఎంటీ కాలనీలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు సారా శంకర్ ముదిరాజ్ శనివారం తెలిపారు. సమావేశంలో నూతన కమిటీతో పాటు మహిళా సంఘం, యువజన సంఘం కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ, సభ్యులు పాటించాల్సిన నియమ నిబంధనలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ సానుకూలమే..

కూకట్‌పల్లి: ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ సానుకూలంగానే ఉందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. ఈ నెల 7న నగరంలో జరుగనున్న లక్ష డప్పులు- వేయి గొంతుకలు కార్యక్రమ సన్నాహక సమావేశాన్ని శనివారం మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ నిర్వహించేందుకు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. వచ్చే శుక్రవారం జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, లక్ష్మయ్య, రఘు, తూము సంతోష్, చున్ను పాషా, శివచౌదరి, అశోక్, నయీమ్, మోసిన్, సచిన్, బాలరాజ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలోని వార్డు కార్యాలయాల్లో సోమవారం నుంచి ఇందిరమ్మ ఇళ్లు, ఫిర్యాదుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తామని గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిళ్ల ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా వార్డు కార్యాలయాలకు సంబంధించి డిజిగ్నేటెడ్ ఆఫీసర్‌గా వార్డు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లను నియమించారు. గాజులరామారం సర్కిల్ పరిధిలోని గాజులరామారం వార్డు కార్యాలయానికి ఏఎంసీ నరసింగ్‌రావు (8978904128), జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయానికి సూపరింటెండెంట్ సునందిని (8008433878), చింతల్ వార్డు ఆఫీస్‌కు సూపరింటెండెంట్ జహవర్ లాల్(9000994018), సూరారం వార్డు కార్యాలయానికి సూపరింటెండెంట్ హరిబాబు (9000994012) లు అడ్మినిస్ట్రేషన్ అధికారులుగా వ్యవహరించనున్నారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ వార్డు కార్యాలయానికి డీపీఓ హిమబిందు (7674831188), సుభాష్‌నగర్ డివిజన్ గణేష్‌గ్రౌండ్‌లోని వార్డు కార్యాలయానికి ఏఎంసీ కృష్ణ(8978901241), కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ రింగ్ రోడ్డులోని వార్డు కార్యాలయానికి సూపరింటెండెంట్ గిరిబాబు (9989930220), జీడిమెట్ల డివిజన్ పరిధి గాయత్రినగర్ వార్డు కార్యాలయానికి సీవో కిషోర్(9700670026) అడ్మినిస్ట్రేషన్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్ : ఆయా డివిజన్‌లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ మిథిల నగర్, ఆర్.కె. లే అవుట్‌లోని విష్ణుప్రియ ఎన్‌క్లేవ్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేదుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.12 లక్షలు, డ్రైనేజీ నిర్మాణాలకు రూ.63 లక్షల నిధులు కేటాయించి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, ఎండీ లాయక్, ఖాజా, అజయ్, హరికృష్ణారెడ్డి, సంతోష్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



జగద్గిరిగుట్ట: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని ఎం.ఎన్.రెడ్డి నగర్‌లో మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మంది వరకు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి హాజరై మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సంపత్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, సతీష్ చక్రవర్తి, నార్లకంటి దుర్గయ్య, నార్లకంటి ప్రతాప్, నల్ల నాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, శివ పాల్గొన్నారు.

7న జరిగే ప్రదర్శనను విజయవంతం చేయాలి



డప్పుల ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

నిజాంపేట్ : ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు వేయి గొంతులు ప్రదర్శనను విజయవంతం చేయాలని దళిత ఐక్య వేదిక సంఘం అధ్యక్షులు మేకల నగేష్ అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును అసెంబ్లీ సాక్షిగా అమలు చేస్తామని చెప్పి మాట తప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీసాయినగర్ బస్టాప్ వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడ సంజీవ ఆధ్వర్యంలో డప్పుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ముక్కర్ల లాలయ్య, మేడ రామ నరసింహ, జలగం చంద్రయ్య, ఉప్పలయ్య, బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివారెడ్డి, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాదిగ విద్యార్థి సంఘం నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ

సుభాష్‌నగర్: హైదరాబాద్‌లో జరిగే మహా ప్రదర్శన వాల్‌పోస్టర్‌ను బహదూర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాట్లాడుతూ.. రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. తక్షణమే వర్గీకరణ అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ 7న జరగబోయే మహా ప్రదర్శనలో మాదిగ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిరిపెల్లి రమేష్, నరేష్, వెంకటేష్, అవినాష్, నరేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: శ్మశాన వాటికల్లో వివిధ సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి పర్వత్‌నగర్, రామారావునగర్, నెహ్రూ నగర్, రాజీవ్‌గాంధీ నగర్, యూసుఫ్ నగర్‌లో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శ్మశాన వాటికల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, విద్యుత్ దీపాలు లేవన్నారు. శ్మశాన వాటికల్లో నీటి సదుపాయం కోసం బోరు వేయించాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. అదే విధంగా కాలనీల్లో మంచినీటి సరఫరా సక్రమంగా లేదని స్థానికుల ఫిర్యాదుతో జలమండలి అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, జలమండలి అధికారులు, శానిటేషన్ అధికారులు, డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, జాహిద్ షరీఫ్ బాబా, జ్ఞానేశ్వర్, రాజు, బ్రహ్మ, సయ్యద్ రియాజ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మోతీనగర్: పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్ వి రామారావు నగర్‌కు చెందిన సాంబశివ సతీమణి మృతి చెందింది. కార్పొరేటర్ సబిహా బేగంతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే విధంగా సఫ్దార్ నగర్‌కు చెందిన షేక్ రఫీ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో అక్రమంగా ప్లాట్ల విక్రయం!

లక్షల్లో సొమ్ము చేసుకుంటున్న సంక్షేమ సంఘం

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలో 15 సంవత్సరాల క్రితం దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి బీద ప్రజల కోసమని సుమారు 24 ఎకరాలలో రాజీవ్ గృహకల్పలో సముదాయం ఏర్పాటు చేశారు. 4 పార్కులతో పాటు 54 బ్లాక్‌లతో 1779 ప్లాట్లతో ఏర్పాటు చేశారు. ఇందులో 1757 ప్లాట్‌లకు ప్రభుత్వ పట్టాలు కేటాయించారు. కొన్ని రోజుల తర్వాత ఖాళీగా ఉన్న 22 ప్లాట్లను అమ్ముకుంటూ సంక్షేమ సంఘం సొమ్ము చేసుకుంటున్నారు. పంపకాల్లో తేడాలు రావడంతో విషయం బయటకు తెలిసింది. ఇంత జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. మిగిలిన ప్లాట్లను అద్దెకిచ్చి డబ్బులు వసూలు చేసి కాలనీ సంక్షేమానికి ఉపయోగిస్తున్నట్లు పెద్దలు కాలం గడిపారు. ఆ తర్వాత ఈ ప్లాట్లపై అడిగేవారే లేరని అమ్మడం మొదలు పెట్టారు. సంక్షేమ సంఘంలో ఉన్న కొంత మంది పెద్దలు ఒక్కో ప్లాట్ రూ. 2 లక్షలకు అమ్మేవారు. ఇప్పుడు రూ.5 లక్షల నుంచి రూ. 6 లక్షలకు అమ్ముతూ అక్రమార్జనకు అలవాటు పడ్డారు. కాగా ఇటీవలే 54వ బ్లాక్‌లో 27వ ప్లాట్ విషయంలో ఒకరికి తెలియకుండా మరొకరు అమ్ముకోవడంతో సంక్షేమ సంఘం పెద్దలలో తేడాలు ఏర్పడి విషయం బయటకు తెలిసింది. ఇటు అద్దెకు ఇస్తూ, అటు ప్లాట్లు అమ్ముతూ వచ్చిన డబ్బులతో కాలనీ అభివృద్ధికి వాడుతున్నారంటే అదీ లేదు. ఇప్పటికీ కాలనీలోని సమస్యలు అలానే ఉన్నాయి. ఇప్పటికైనా హౌసింగ్ డిపార్ట్‌మెంట్, జీహెచ్ఎంసీ అధికారులు చొరవ చూపి వీరి అక్రమార్జనకు పులిస్టాప్ పెడతారో? వేచి చూడాలి.